

కాకినాడ
ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34(ఆదివారం)
కనిష్ఠం : 27

సేంద్రియ వ్యవసాయంతో ఆరోగ్యకర సమాజం 7

నాయకా.. కదలాలిక!

ఐదేళ్లయినా కుర్చీ వదలని పలువురు ఉద్యోగులు

గవర్నమెంట్ ఐటీఐలో ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న ఓ ఉద్యోగి అదే ప్రాంగణంలో ఉన్న ఉపాధి కార్యాలయంలో పనిచేసి.. తిరిగి మళ్లీ ఐటీఐ కార్యాలయానికి బదిలీపై వచ్చారు. తాజాగా యూనియన్‌లో చేరి మరో నాలుగేళ్లు ఇక్కడే పనిచేసేందుకు స్కెచ్ వేశారు. ఇలా దాదాపు అన్ని విభాగాల్లోని నాయకులు ఈ పాత చింతకాయలాంటి జీవోను పట్టుకుని మరి కొన్నేళ్ల పాటు కార్యాలయంలో చక్రం తిప్పేందుకు ప్రయత్నిస్తున్నారు.. ఇటువంటి వారికి కూటమి ప్రభుత్వం గట్టి షాక్ ఇచ్చింది. సాధారణ బదిలీల్లో సర్వీస్ అసోసియేషన్ ఆఫీస్ బేరర్లకు మినహాయింపు ఇచ్చే ముందు సర్టిఫికెట్ల వాస్తవికత ధ్రువీకరించుకోవాలని ఆదేశించింది.



- ఏళ్లుగా తిష్ట వేసిన ఉద్యోగులు
- పదేళ్లయినా సీటు వీడని వైనం
- కదిలేందుకు అనాసక్తత
- ఉద్యోగ సంఘాల్లో చేరిక
- పలు ఆఫీసుల్లో ఇదే పరిస్థితి
- ప్రభుత్వ ఉత్తర్వులతో షాక్
- బదిలీలకు ఐదు రోజులే గడువు

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ ప్రక్రియలో పారదర్శకత కొరవడుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని శాఖల్లో కుర్చీలను వదిలేందుకు ఇష్టపడని కొందరు ఉద్యోగులు 'పాత'దారులు వెతుక్కుంటున్నారు.ఎలాగైనా అదే శాఖలో మళ్లీ తిష్ఠవేయాలని ఎత్తుగడలు వేస్తున్నారు. ప్రభుత్వ తాజా ఉత్తర్వులను, జీవోలను పక్కన పెట్టి కాలం చెల్లిన పాత జీవోలను తెరపైకి తెస్తున్నారు. ఏళ్ల తరబడి సీట్లకు అతుక్కుపోయి రాజకీయం చేస్తున్న కొందరు..ఉద్యోగ సంఘాల నాయకులమనే పేరుతో బదిలీలకు బ్రేక్‌లు వేయించుకుంటున్నారనే విమర్శలున్నాయి.

ఈ నెల 31 వరకు గడువు..

ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.2025 మే 31 నాటికి ఒక స్టేషన్లో ఐదేళ్లు నిరంతరాయంగా పనిచేసిన ఉద్యోగులను బదిలీ చేయాలని సూచించింది.ఒక స్టేషన్లో (అంటే కార్యాలయం లేదా సంస్థ కాదు. వాస్తవంగా పని చేసే ప్రదేశం(నగరం, పట్టణం, గ్రామం) ఐదేళ్లు పూర్తి చేసిన వారే కాకుండా ఇతర ఉద్యో గులు వ్యక్తిగత అభ్యర్థన మేరకు బదిలీకి అర్హులు. అటువంటి ఉద్యోగులందరికీ ప్రాధాన్యమివ్వాలి. ఇందులో ఆయా ఉద్యోగ సంఘాల్లో పనిచేసిన వారికి కొంత వెసులుబాటు ఉంది. వారు అదనంగా మరో నాలుగేళ్లు అంటే తొమ్మిదేళ్ల పాటు వారు ఒకే స్టేషన్లో పనిచేయవచ్చు. తొమ్మిదేళ్ల పూర్తయ్యాక కచ్చితంగా బదిలీ చేయాలి.

స్వీటు అందుకే..

చాలా మంది ఉద్యోగులు బదిలీ అయి వెళ్లడానికి అంగీకరించరు.. ఏదో రకంగా కుర్చీకి అతుక్కుపోవడానికే చూస్తారు.. ఎందుకంటే ఆ సీటుకు ఉన్న డిమాండ్ అటువంటిది.. బాగా ఆదాయవనరు ఉన్న సీటుకు అంతా ఇంతా డిమాండ్ కాదు.. రూ.లక్షలు పోసి ఆ సీటు సంపాదిస్తారు. అటువంటి సీటును కాపాడుకోవడానికి ఉద్యోగులు తీవ్ర ప్రయత్నాలు చేస్తారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్, ఖజానా తదితర విభాగాల్లో డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అదే జరుగుతోంది.. డిమాండ్ ఉన్న సీటును కాపాడుకోవడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం అటువంటి సీట్లపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే అవినీతికి అడ్డుకట్ట వేసే అవకాశమూ ఉంటుంది..

ఉద్యోగుల ప్రయత్నాలు..

ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఒకే స్టేషన్‌లో పనిచేసిన ప్రతి ఉద్యోగిని కచ్చితంగా బదిలీ చేయాలని సూచించింది.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 20 వేల మంది ఉద్యోగులు ఉండగా వీరిలో 500 నుంచి 700 మంది బదిలీ కావొచ్చని అంచనా.ఎందుకంటే గతేడాది సెప్టెంబరులో సాధారణ బదిలీల ప్రక్రియ ముగిసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత బదిలీల ఏళ్ల తరబడి పాతుకుపోయిన వారు కదలాల్సి ఉంటుంది. జిల్లాలోని అన్ని విభాగాల్లో దాదాపు ఐదేళ్లు దాటిన వారే కాదు.. 7-10 ఏళ్లకు పైగా ఒకే స్టేషన్లో తిష్ఠవేసి రాజకీయాలు చేస్తున్న వారూ ఉన్నారు. ముఖ్యంగా ఉద్యోగ సంఘాల పేరుతో తమ బదిలీలను నిలుపుదల చేసుకుంటూ కొందరు వస్తున్నారు. సంఘాల్లో ఉండే నాయకులకు ఐదేళ్లతో పాటు మరో నాలుగేళ్లు కలిపి సుమారు తొమ్మిదేళ్ల పాటు ఒకే స్టేషన్లో పనిచేసే అవ కాశం ఉంది. ప్రస్తుతం కొన్ని శాఖల్లోని ఉద్యోగులు కొందరు సంఘ నేతలుగా అవతారమెత్తి బదిలీ కా కుండా చూసుకుంటున్నారు.ఈ మేరకు కొందరు ఉద్యోగులు రెండు,మూడు నెలల కిందట డబ్బు లు కట్టి ఉద్యోగ సంఘాల్లో నాయకులుగా చేరిపోయారు. ఎగ్జిక్యూటివ్ పదవులు దక్కించుకున్నారు.తాము యూనియన్లలో ఉన్నామని తమ కు బదిలీలు వర్తించబోవని తప్పించుకుంటున్నారు. ఒకే డిపార్ట్‌మెంట్‌లో ఉండే ప్రభుత్వ ఐటీఐ, టెక్నికల్ ఆర్‌జేడీ,జిల్లా ఉపాధి కార్యాలయాల్లోని పలువురు ఉద్యోగులు సీట్లకు అతుక్కుపోయేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు.2012 నాటి సర్క్యులర్ మెమోను చూపించి బదిలీ నుంచి తప్పించుకునేందుకు ఉద్యోగ సంఘాల నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్టుగా తెలుస్తోంది.

సీఎస్ చెక్ పెట్టారిలా..

ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ ఎస్ఎస్ రావత్ విడుదల చేసిన సర్క్యులర్ మెమో ఇలాంటి నేతల ఆటలకు చెక్ పెట్టినట్టయ్యింది. గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల ఆఫీస్ బేరర్లకు వర్తింపజేసే సాధారణ బదిలీ మినహాయింపు సౌకర్యాన్ని గతంలో దుర్వినియోగం చేసినట్టు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో అన్ని శాఖల అధిపతులు, కలెక్టర్లు, జిల్లా మెజిస్ట్రేట్ల అసోసియేషన్ల నుంచి నిర్ణీత పత్రాలను పొందాలని ప్రభుత్వం సూచించింది. సాధారణ బదిలీల్లో సర్వీస్ అసోసియేషన్ ఆఫీస్ బేరర్లకు మినహాయింపు ఇచ్చే ముందు సర్టిఫికెట్ల వాస్తవికతను పూర్తిగా ధ్రువీకరించుకోవాలని ఆదేశించింది.మినహాయింపు కోరుతున్న ఆఫీస్ బేరర్ పదవి, పదవీకాలం తదితర విషయాలు అసోసియేషన్ ఉపచట్టాల్లో కవర్ చేసి ఉన్నాయో లేదో పరిశీలించాలని,వారి పేరు అసోసియేషన్ ఓటర్ల జాబితాలో ఉందో లేదో తదితర అన్ని విషయాలను ధ్రువీకరించుకున్న తర్వాత మాత్రమే సాధారణ బదిలీల్లో మినహాయింపు వర్తింపజేయాలని సూచించారు. ఈ విషయంలో ఎటువంటి ఉల్లంఘనలు జరిగినా సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలను తీసుకోవాలని విభాగాధిపతులు, కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశించింది.



హేవలాక్ బ్రిడ్జి
పుష్కలంగా నిధులు..

పుష్కరాలకు పనులయ్యేనా!

నేటికీ కదలని అఖండ గోదావరి ప్రాజెక్టు

- రూ.94 కోట్ల నిధులు విడుదల
- పుష్కరఘాట్‌కు టెండర్ ఖరారు
- అభివృద్ధికి ఎదురుచూపులు
- అయినా ఆరంభంకాని పనులు
- అఖండ గోదావరి ప్రాజెక్టు జాప్యం
- పట్టించుకోని అధికారులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అఖండ గోదావరి ప్రాజెక్టుకు పుష్కలంగా నిధులు వచ్చినా.. పనులు ఆరంభించడంలో అధికారులు జాప్యం చేస్తుండడం చర్చనీయాంశమవుతోంది. గత పుష్కరాల సమయంలో సీఎం చంద్రబాబు స్వయంగా బోటు మీద గోదావరి నదిలో పయ నించి పర్యాటరంగానికి ఇది చాలా అనువైన ప్రాంతమని భావించారు. వెంటనే అఖండ గోదావరి ప్రాజెక్టు పేరిట రూ.100కోట్లు మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. అఖండ గోదావరి టూరిజానికి సంబంధించిన ప్రధాన కార్యాలయం కూడా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఈ మేరకు అనుకున్నదే తడవుగా రీజినల్ కార్యాలయం పెట్టారు. అధికారినీ నియమించారు. ఉభయ గోదావరి జిల్లాల్లో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి, హేవలాక్ బ్రిడ్జిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దడానికి ఉపక్రమించారు. కానీ తర్వాత ప్రభుత్వం మారడంతో అఖండగోదావరి ప్రాజెక్టుతో పాటు కార్యాలయం ఎత్తేశారు. గత సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయంతో చంద్రబాబు నాయకత్వంలో కూటమి విజయం సాధించడం, ఆయన ముఖ్యమంత్రి కావడం తెలిసిందే.ఈ నేపథ్యంలో మళ్లీ అఖండ గోదావరికి ప్రాణం పోశారు. పైగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రిగా రాజమహేంద్రవరానికి చెందిన కందుల దుర్గేష్ ఉన్న సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వ స్కీమ్ సాసాతో రూ.94కోట్లు మంజూరు చేశారు. నిధులు వచ్చేశాయి. ఈ ప్రాజెక్టు కింద రాజమహేంద్రవరం పుష్కరఘాట్‌ను ఆధ్యాత్మికంగా, పర్యాటక కళ ఉట్టిపడేలా తీర్చిదిద్దనున్నారు. డిజైన్లు సిద్ధమైనట్టు సమాచారం. ఇటీవల టెండర్లు ఖరారు చేశారు. ఇక్కడ మ్యూజిక్ టవర్, నక్షత్ర స్తంభం, ఓం సింబల్, నదిలో నీళ్లు తాగుతున్నట్టు ఏనుగు విగ్రహాలు.. పలు అభివృద్ధి పనులు చేయనున్నారు. నిధులున్నా ఇంకా పనులు ఆరంభించలేదు. వచ్చేది వర్షాకాలం కావడంతో పుష్కరఘాట్‌లో పనులకు ఆటంకం కలుగుతుంది. అఖండ గోదావరి ప్రాజెక్టు కింద హేవలాక్ బ్రిడ్జిని పర్యాటక కట్టడంగా అభివృద్ధి చేయడం, కడియం నర్సరీల్లో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడం, కడియపులంక కాలువలో బోట్ షికారు, నిడదవోలు కోట సత్తెమ్మ గుడివద్ద భక్తుల వసతి భవనం పనులు ఉన్నాయి. ఇంకా టెండర్లు పిలవలేదు. పనులైతేనే పుష్కరాల నాటికి ప్రభుత్వం భావించినట్లు అభివృద్ధి కనిపిస్తుంది.

మహా..సందడి

- రేపటి నుంచి మహానాడు
- ఉమ్మడి జిల్లా నుంచి సన్నద్ధం
- నేడు కడపకు టీడీపీ నేతల క్యూ
- కార్యకర్తలు,అభిమానుల సమీకరణ
- నియోజకవర్గాల వారీ ఏర్పాట్లు
- బస్‌లు, కార్లలో తరలింపు
- ప్రత్యేకంగా విందు ఏర్పాట్లు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

పసుపు పండుగకు జనం సన్నద్ధమయ్యారు.. తండోపతండాలుగా నాయకులు.. కార్యకర్తలు తరలివెళ్లేలా నాయకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. కడపలో ఈ నెల 27,28,29 తేదీల్లో టీడీపీ మహానాడు పండుగ నిర్వహించనున్నారు. ఆ పండుగలో భాగస్వామ్యం కావడానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి పసుపు దండు కదలనుంది. సోమవారం ఉదయం అన్ని నియోజకవర్గాలనుంచి ఆయా ప్రాంత ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిల నాయకత్వంలో వేలాదిగా తరలివెళ్లనున్నారు. ఎన్నికల ముందు రాజమహేంద్రవరంలో మహానాడుతోపాటు ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటగా జరగబోయే ఈ మహానాడు కడపలో బ్రహ్మాండంగా నిర్వహించనున్నారు. వైసీపీ అధినేత జగన్‌కు అడ్డాగా ఉన్న కడపలో టీడీపీ గత ఎన్నికల్లో కూడా విజయఢంకా మోగించిన సంగతి తెలిసిందే. ఇవాళ మహానాడు ఘనంగా నిర్వహించడం ద్వారా అక్కడ తమ సత్తా ఏంటో చూపాలనేది టీడీపీ వ్యూహంగా కనిపిస్తోంది. మహానాడు నిర్వహణకు 19కమిటీలు నియమించిన సంగతి తెలిసిందే. అందులో ముఖ్యమైన తీర్మానాల కమిటీ కన్వీనర్‌గా పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు వ్యవహరించడంతోపాటు కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కమిటీ కన్వీనర్‌గా ఉన్న సంగతి తె లిసిందే. పలు కమిటీల్లో మన ప్రాంత నేతలు కొందరు నేతలు సభ్యులుగా నియమితులయ్యారు. కార్యకర్తలకు కొంతమందికి ఇప్పటికే నామినేటెడ్ పదవులు దక్కాయి. వందలాది పోస్టులు రానున్నాయి. ఈ నేపథ్యంలో మహానాడులో పాల్గొనడానికి టీడీపీ శ్రేణులు బాగా ఉత్సాహ పడుతున్నాయి. గత వైసీపీ అరాచక పాలననుంచి బయటపడిన ఆనందంతో క్యాడర్ ఉత్సాహంగా ఉంది. ఇప్పటికే ప్రతి నియోజకవర్గంలోను మహానాడు సన్నాహక సభలు పెట్టుకోవడంతోపాటు జిల్లాల మినీమహానాడు ఘనంగా నిర్వహి ంచిన సంగతి తెలిసిందే. అందరిలోనూ జోష్ పెరిగింది. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మహానాడులో కచ్చితంగా పాల్గొనాలనే ఆలోచనతో అమెరికా టూర్‌ను మధ్యలోనే ఆపుకుని రావడం గమనార్హం. సోమవారం ఉదయం అన్ని నియోజకవర్గాల నుంచి టీడీపీ పసుపు దండు చలో మహానాడు అంటూ బయలుదేరనుంది.



అమరావతిలో మహానాడుపై చర్చిస్తున్న మంత్రి సుభాష్, బీసీ కార్పొరేషన్ చైర్మన్ సత్తిబాబు

కడప 950 కి.మీ

ఈ మేరకు నాయకులు ఎక్కడికక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రాజమహేంద్రవరం నుంచి కడపకు 950 కిలోమీటర్లు.. కాకినాడ, కోనసీమ నుంచి వెయ్యి కిలోమీటర్లు దాటి ఉంటుంది.రోడ్డు మార్గాన వెళ్లాలంటే 9 గంటలు పైనే పడుతుంది. ఈ నేపథ్యంలో ఆహార ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం టిఫిన్.. మధ్యాహ్నం భోజనం.. సాయంత్రం స్నాక్స్.. రాత్రికి భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. 27వ తేదీన ఉదయం నుంచే మహానాడు కార్యక్రమం ఆరంభిస్తారు. సమయానికి అక్కడకు చేరుకునేలా ప్రణాళిక రచిస్తున్నారు. ఆయా నియోజకవర్గాలవారీగా వెళ్లేలా ఎమ్మెల్యేలు ఏర్పాట్లు చేశారు.



కడపలో మహానాడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

బాలబాలాజీ స్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం 7

'యంత్ర'తంత్రం!

- సాగులో డ్రోన్ల వినియోగం
- జిల్లాలో 42 రైతు సంఘాలకు అందించేలా చర్యలు
- త్వరలో పంపిణీకి వ్యవసాయాధికారుల ఏర్పాట్లు



వ్యవసాయ డ్రోన్‌ను ప్రయోగిస్తున్న జిల్లా వ్యవసాయాధికారులు

డ్రోన్.. డ్రోన్.. డ్రోన్.. ప్రస్తుతం ఎక్కడ చూసినా ఇదే మాట.. జనాలు వెళ్లలేని చోటకు ఇవి వెళ్తుండడంతో వీటికి క్రేజ్ పెరిగింది. వీటి వినియోగమూ అధికమైంది. ఇప్పటివరకు సంప్రదాయ పద్ధతుల్లో వ్యవసాయం చేపడుతూ వస్తోన్న రైతులు సైతం ఈ డ్రోన్ టెక్నాలజీకి ఆకర్షితులవుతున్నారు. లక్షలాది రూపాయలు విలువ చేసే వీటి కొనుగోలుపై ఆసక్తి కనబరుస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే ముగ్గురు రైతులు వ్యక్తిగతంగా కొని వ్యవసాయ రంగంలో డ్రోన్‌ల వినియోగానికి శ్రీకారం చుట్టారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

వ్యవసాయ రంగంలో వృథా వ్యయానికి, కూలీల కొరతకు డ్రోన్లు కళ్లెం వేయనున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు యంత్రాల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఈనెలలో డ్రోన్లు అందించి వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చేందుకు సిద్ధమవుతోంది. జిల్లాలో 64వేల హెక్టార్లలో వరి సాగవుతోంది. వరి దిగుబడి 5.79 లక్షల మెట్రిక్ టన్నులు. జిల్లాలో 3లక్షలమంది రైతులు ఉన్నారు. సాగులో ఎరువుల వాడకం, మందుల పిచికారీ, కూలీకు విపరీతమైన వ్యయం అవుతోంది. వీటితోపాటు నిర్ణీత సమయంలో పూర్తి కాకపోవడం, ఆశించినంత ఫలితాలు లేకపోవడంతో ప్రయాస ఎదురవుతోంది. డ్రోన్ టెక్నాలజీతో శ్రమ, వ్యయం రెండూ తగ్గనున్నాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయశాఖ వీటిపై విస్తృత ప్రచారం చేస్తోంది. మరోవైపు రైతులు కూడా వీటి వినియోగంపై మక్కువ చూపుతున్నారు.

రైతులకు రాయితీపై..

ప్రస్తుతం వ్యవసాయంలో వినియోగించే డ్రోన్ ధర రూ.9.80 లక్షలు ఉంది. జిల్లాలో 42 డ్రోన్లు అందించేలా జిల్లా వ్యవసాయ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఐదు నుంచి ఆరుగురు రైతులను ఒక సంఘంగా రూపొందించి, వారందరికీ కలిపి ఒక డ్రోన్‌ను సబ్సిడీపై అందిస్తున్నారు. ఇలా 42సంఘాలను సిద్ధం చేశారు. వీరికి డ్రోన్‌ల వినియోగంపై ఉచిత శిక్షణ కూడా అందించారు. రూ.9.80లక్షల విలువగల డ్రోన్‌కు 80శాతం సబ్సిడీ అంటే రూ.7.84లక్షలు ఇస్తారు. రైతులు చెల్లించాల్సిన మొత్తం రూ.1.96లక్షలు మాత్రమే. రైతులు ముందుగా డ్రోన్ విలువలో సగం సొమ్ము అంటే రూ.4.90 లక్షలు బ్యాంకులో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. రుణం, రాయితీ మంజూరయ్యాక వాటిలో రూ.2.90లక్షలు తిరిగి వస్తుంది. మిగిలిన సొమ్మును అతి తక్కువ వడ్డీతో వాయిదాల పద్ధతిలో చెల్లించాల్సి ఉంటుంది.

అన్ని రకాలుగా ఉపయోగమే..

జిల్లాలో ప్రస్తుతం నమో డ్రోన్ డీడీ పథకంలో ఇచ్చిన డ్రోన్లు మూడు, ప్రైవేటు డ్రోన్లు మూడు ఉన్నాయి. ఇవి జగ్గంపేటలో మూడు, ప్రత్తిపాడులో రెండు, కరపలో ఒకటి ఉన్నాయి. ఇటీవలే పిఠాపురం నియోజకవర్గంలో పలువురు రైతులకు రెండు డ్రోన్లను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అందజేశారు. ఎకరా పంట చేలో నిమిషాల వ్యవధిలో ఎరువులు పిచికారీ చేసుకోవచ్చు. అంతేకాదు.. సేంద్రియ వ్యవసాయంలో కషాయాల పిచికారీకి, విత్తనాలు చల్లుకునేందుకు కూడా వీటిని వినియోగిస్తున్నారు. డ్రోన్ ఉపయోగించడం ద్వారా మందుల పిచికారీతో పాటు పొలం పరిస్థితిని నిశితంగా పరిశీలించుకోవడం, నీటి తడులు ఎప్పుడు పెట్టాలో, కలుపు ఎక్కడ ఎక్కువగా ఉందో పరిశీలించుకునే అవకాశం ఉంది. మడుల్లోకి దిగకుండానే ఇవన్నీ పరిశీలించవచ్చని డ్రోన్లు వినియోగిస్తున్న రైతులు అంటున్నారు.

వినియోగంపై చైతన్యం కలిగిస్తున్నాం

రైతుల్లో చైతన్యం పెరుగుతోంది. ఈ నెలాఖరు నాటికిగానీ, జూలై మొదటి వారంలో గానీ డ్రోన్లు అందించే అవకాశం ఉంది. వాటి ద్వారా రైతులు సాగు చేసుకునేలా వారిని సిద్ధం చేస్తున్నాం. వ్యవసాయంలో యాంత్రీకరణతో ఎన్నో లాభాలున్నాయి. కూలీల కొరత సమస్యలను అధిగమించవచ్చు. కూలీల ద్వారా మందు ద్రావణాన్ని పిచికారీ చేస్తే ఎకరాకు రూ.1500 నుంచి రూ.2000 అయితే డ్రోన్ ద్వారా రూ.400 ఖర్చవుతుంది.

-విజయకుమార్, వ్యవసాయశాఖ జేడీ

దేవదాయ, ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో యోగాపై అవగాహన

కార్పొరేషన్(కాకినాడ), మే 25(ఆంధ్రజ్యోతి): ఈనెల 21 నుంచి జూన్ 21 వరకు నిర్వహించ తలపెట్టిన యోగా కార్యక్రమాల్లో భాగంగా కాకినాడ జిల్లా దేవదాయ, ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో ఉప కమిషనర్ డీఎల్‌వీ రమేష్‌బాబు అధ్యక్షతన ఆదివారం ఉదయం 7గంటల నుంచి 10గంటల వరకు యోగా గురువులు వేదల శ్రీకృష్ణ ఫణీంద్ర యోగి, చిట్టూరి చిట్టిబాబు ఆధ్వర్యంలో కాకినాడ సూర్యారావుపేట శ్రీబాలత్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి వారి దేవస్థానంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఈ దుర్గేష్, స్థపతి శ్రీనివాసాచార్యులు, డీఈ శ్రీనివాస్, డీఈఓ సుబ్బారావు, గ్రంధి నారాయణరావు, నేమాని సత్యనారాయణ, కార్యనిర్వాహణాధికారి, అర్చకులు పాల్గొన్నారు.



కాకినాడలో యోగాపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నేడు కాకినాడలో యోగాంధ్ర

- ఉదయం 6నుంచి 8గంటల వరకు నిర్వహణ: కమిషనర్

కార్పొరేషన్(కాకినాడ), మే 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని కాకినాడ రామారావుపేట ఎండోమెంట్స్ డిపార్ట్‌మెంట్ రోడ్డులో సోమవారం ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు నిర్వహిస్తున్నామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన తెలిపారు. నూకాలమ్మగుడి సెంటర్‌నుంచి మూడు లైట్ల జంక్షన్ మీదుగా సీపీఎం స్కూల్‌నుంచి పాతబస్టాండ్ వైపునకు ట్రాఫిక్ మళ్లిస్తున్నామని, ప్రజలు గమనించి మున్సిపల్, ట్రాఫిక్ సిబ్బందికి సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

కాకినాడ సిటీ, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటైన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు కలెక్టర్‌లో నిర్వహించనున్నారు. కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ విధిగా హాజరుకావాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో మండలస్థాయిలో జరిగే ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధికారులందరూ ఉదయం 9.30గంటలకు హాజరుకావాలని ఆదేశించారు.

మరిడమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ




పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, మే 25(ఆంధ్రజ్యోతి): మరిడమ్మ జాతర పోస్టర్‌ను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. అందరి సహకారంతో జాతరను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఉత్సవాలు జూన్ 25నుంచి జూలై 31 వరకు నిర్వహించనున్నట్లు దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో రాజా సూరిబాబు రాజు, కొత్తెం వెంకట శ్రీనివాసరావు(కోటి), ఎలిశెట్టి నాని, నూనె రామారావు, అడబాల కుమారస్వామి, దేవాదాయశాఖ సిబ్బంది రమణ, క్రాంతివీర్, శివ పాల్గొన్నారు.

గోదారి గుట్టు మీద గంపెడు అందాలే..

రాజమహేంద్రవరం గోదావరి గట్టు అంటేనే అందాలకు మారు పేరు. ఆ గట్టు మీద సాయం సమయాన సూర్యుడు అస్తమిస్తుండగా ఆ ఛాయలు గోదావరి మీద పడితే వర్ణ శోభితమే. దాన్ని చూసిన ఎవరైనా మనసు పారేసుకుంటారు. వెంటనే తమ ఫోన్లలో బంధించేందుకు ప్రయత్నించకుండా ఉండలేరు. ఆ దృశ్యాల్నే ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా..







ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

అమలాపురంలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల
పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్

ప్రారంభించిన ఎమ్మెల్యే ఆనందరావు



పోటీలు ప్రారంభించి పవర్ లిఫ్టింగ్ చేస్తున్న ఎమ్మెల్యే

అమలాపురం టౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సర్‌సీవీ రామన్ పబ్లిక్ స్కూలు ఆవరణలో ఆదివారం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్-2025 పోటీలను అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 3శాతం రిజర్వేషన్లు కల్పించడం ఎంతైనా అభినందనీయమని, క్రీడా రంగాన్ని ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని వివరించారు. వివిధ విభాగాల క్రీడా పోటీలను అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబులు ప్రారంభించారు. అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్, స్పోర్ట్స్ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో నిర్వాహకులు, జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు, బాడీబిల్డింగ్ అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు, మున్సిపల్ మాజీచైర్మన్ చిక్కాల గణేష్, మాజీ కౌన్సిలర్లు జంగా అబ్బాయివెంకన్న, ఆశెట్టి ఆదిబాబు, పెద్దిరాజు రాము, పప్పుల శ్రీరామచంద్రమూర్తి, సూదా గణపతి పాల్గొన్నారు.



పవర్ లిఫ్టింగ్ చేస్తున్న అంతర్జాతీయ క్రీడాకారిణి వందన



పవర్ లిఫ్టింగ్ చేస్తున్న జగన్

విజేతల వివరాలు...

పోటీలు 3 విభాగాల్లో పది కేటగిరీల్లో హోరాహోరీగా జరిగాయి. న్యాయ నిర్ణేతలుగా దొమ్మేటి వెంకటరమణ, డి.లక్ష్మీనారాయణ, డీఆర్కే నాగేశ్వరరావు, జి.వీరభద్రరావు, ఎ.బాలకృష్ణ, చిక్కం రాజబాబు వ్యవహరించారు. ఆయా విభాగాల విజేతలను జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు ప్రకటించారు. పవర్‌లిఫ్టింగ్ 53 కిలోల మెన్ విభాగంలో వై.వీరబాబు (పి.గన్నవరం) ప్రథమ, జె.జితేంద్రదొర (అమలాపురం) ద్వితీయ, సీహెచ్.సంపత్ (కాకినాడ) తృతీయ స్థానాలు సాధించారు. 59 కిలోల విభాగంలో వై.రాజు (రాజమహేంద్రవరం), వై.మహేష్, పి.సతీష్ (కాకినాడ) వరుస స్థానాల్లో నిలిచారు. 66కిలోల విభాగంలో ఎం.జగన్ (కాకినాడ), ఎ.దుర్గాప్రసాద్ (ద్రాక్షారామం), బి.నానిబాబు (కాకినాడ) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. మహిళా విభాగంలో పిల్లి వందన (అమలాపురం) ప్రథమ, బి.అఖిల (రామచంద్రపురం) ద్వితీయ, బి.సింధు (అమలాపురం) తృతీయ స్థానాలు సాధించారు. మాస్టర్స్ విభాగంలో బి.అప్పన్న (అమలాపురం) ప్రథమ, డి.నాగేశ్వరరావు (రామచంద్రపురం) ద్వితీయ, ఏఎస్.ప్రసాద్ (అమలాపురం) తృతీయస్థానాలు సాధించారు.

సత్యవాడలో అధికారులు అప్రమత్తం

కరోనా కేసు నమోదుతో మెడికల్ క్యాంపు ఏర్పాటు, ఇంటింటా ఆరోగ్యంపై సర్వే



ప్రజల ఆరోగ్యంపై ఆరా తీస్తున్న వైద్య సిబ్బంది

కె.గంగవరం, మే 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం సత్యవాడలో కరోనా కేసు నమోదు కావడంతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. కార్మికశాఖమంత్రి వాసంశెట్టి సుభాష్, కలెక్టర్ మహేష్‌కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి దుర్గారావు దొర అదేశాలతో రామచంద్రపురం సబ్‌డివిజన్ అధికారి డాక్టర్ ప్రశాంతి, పామర్రు ప్రభుత్వాసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పోలిశెట్టి హర్షిత, డాక్టర్ పసుపులేటి విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో సత్యవాడలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఇంటింటా సర్వే చేయించారు. అనారోగ్యం బారిన పడిన వారికి మందులు పంపిణీ చేశారు. ప్రతీ ఇంటికి వెళ్లి ఆరా తీశారు. ప్రతీ ఒక్కరు వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవాలని, కరోనా వైరస్ నిర్మూలనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలో ప్రతేక పారిశుధ్య నిర్వహణ నిర్వహించారు. కరోనా నిర్ధారణ అయిన వ్యక్తి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడని, ప్రజలు ఆందోళన చెందాల్సిన పని లేదని చెప్పారు. వైద్య శిబిరంలో సర్పంచ్ సలాది సూర్యకళావతి, ఉప సర్పంచ్ సలాది శ్రీనివాసు పాల్గొన్నారు.

బాలబాలాజీ కల్యాణోత్సవాలు ప్రారంభం



పందిరి రాట పాతుతున్న దృశ్యం

మామిడికుదురు, మే 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అప్పనపల్లి బాలబాలాజీ కల్యాణోత్సవాలు ఆదివారం పందిరి రాట పాతడంతో ప్రారంభమయ్యాయి. వేదమంత్రోచ్చారణల మధ్య ఆదివారం సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు కల్యాణోత్సవాలకు శ్రీకారంచుట్టారు. వైశాఖ మాసం కృష్ణపక్షం త్రయోదశి అశ్వినీ నక్షత్ర శుభ ముహూర్తాన పందిరి రాటను పాతి ప్రత్యేక పూజలు చేసి కల్యాణోత్సవాలకు ఏవిధమైన ఆటంకాలు కలగకుండా ఉండాలని కోరారు. జూన్ 5 నుంచి 9 వరకు కల్యాణోత్సవాల సందర్భంగా పలు పూజా కార్యక్రమాలు జరుగుతాయని, 6న రాత్రి 9.15 గంటలకు స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆయన తెలిపారు.

సేంద్రియ వ్యవసాయంతో ఆరోగ్యకర సమాజం

ప్రకృతి వ్యవసాయ ప్రచారకుడు విజయరామ్
కాకినాడలో ఉమ్మడి జిల్లా ప్రకృతి వ్యవసాయ అవగాహన సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న విజయరామ్

కాకినాడ సిటీ, మే 25 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ వ్యవసాయం ఆరోగ్యకర సమాజానికి దోహదపడుతుందని ప్రకృతి వ్యవసాయ ప్రచారకుడు, సేంద్రియ నిపుణుడు ఎం.విజయరామ్ పేర్కొన్నారు. ప్రకృతి రాగా సంస్థ అధినేత అజ్జరపు మల్లికార్జునరావు అధ్యక్షతన కాకినాడ దంటు కళా క్షేత్రంలో ఆదివారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రకృతి వ్యవసాయ అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన విజయరామ్ జ్యోతిప్రజ్వలనతో సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన పంటలు, పండ్లను పండించి ప్రజల ఆరోగ్యాన్ని రక్షించవచ్చన్నారు. భూతాపాన్ని తగ్గించేందుకు, భవిష్యత్తు తరాల వారు రోగాల బారినపడకుండా రక్షించేందుకు ప్రకృతి వ్యవసాయమే పరిష్కార మార్గమన్నారు. సేంద్రియ వ్యవసాయ విధానం ద్వారా రసాయనాల వాడకం లేని పంట ఉత్పత్తులను ప్రజలకు అందించవచ్చన్నారు. పశు సంపదను రక్షించుకోకపోతే మానవాళికి భవిష్యత్తు ఉండదన్నారు. భూ సమతుల్యత, వైవిధ్యం కాపాడుకోవడం మనందరి సమష్టి బాధ్యత అన్నారు. రాత్రి సమయాల్లో పశువులను తరలిస్తున్న వారిని అడ్డుకోవాల్సిన బాధ్యత మనందరి పైనా ఉందని, ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఈ విషయంలో కెప్టెన్ మల్లికార్జునరావు దంపతులు చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ ఆకట్టుకుందన్నారు. భవిష్యత్తు తరాల వారు ఆరోగ్యకరంగా జీవించాలంటే సేంద్రియ వ్యవసాయం ప్రధానమన్నారు. ప్రకృతి వ్యవసా యం ఆవశ్యకత, వ్యవసాయ విధి విధానాలు, గోమాత విశిష్టతను సమగ్రంగా వివరించారు. కెప్టెన్ మల్లికార్జునరావు అధ్యక్షోపన్యాసం, రాజ మహేంద్రవరానికి చెందిన అంబటి శివప్రసాద్ స్వాగతోపన్యాసం చేశారు. సదస్సులో వల్లూరి మధు, మైలవరపు సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, సాగర్ రాజా, సంప్రదాయ వ్యవసాయదారులు పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులతో అల్పాహారం, భోజనం తయారుచేయించి అతిథులకు, సభికులకు వడ్డించారు.

కుక్కల దాడిలో లేగ దూడ మృతి

రెండు ఆవులకు గాయాలు



మృతిచెందిన లేగ దూడ

గోకవరం, మే 25 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం గుమ్మళ్ళదొడ్డి గ్రామంలో ఆదివారం వీధి కుక్కల దాడిలో ఒక లేగ దూడ మృతిచెందగా, గ్రామంలోని నాగులపాటి నారాయణకుమార్‌కు చెందిన రెండు ఆవులకు గాయాలయ్యాయి. గ్రామంలో కుక్కల సంచారం ఎక్కువగా ఉందని, అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అంతర్వేదిలో కొండచిలువ హతం



అంతర్వేది దేవస్థానం గ్రామంలో స్థానికులు హతమార్చిన కొండచిలువ

అంతర్వేది, మే 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లో మండలం అంతర్వేది దేవస్థానం గ్రామంలో ఆదివారం ఉదయం కొండచిలువ హల్‌చల్ చేసింది. స్థానిక రాజుల అన్నదాన సత్రంలో కొండచిలువ కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అన్నదాన సత్రానికి ఉన్న మంచినీటి సంపులోకి 2 మీటర్లు ఉన్న కొండచిలువ జారిపోవడంతో స్థానికులు చాకచక్యంగా పట్టుకునిహతమార్చారు.

అపార సహజవాయువు, చమురు నిక్షేపాలను రక్షించుకోవాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల, కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు మహదేవ్



సదస్సులో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

అమలాపురం టౌన్, మే 25(ఆంధ్రజ్యోతి): కేజీ బేసిన్‌లో అపార సహజవాయువు, చమురు నిక్షేపాలు ఉన్నాయని వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు వైవీఎస్ మహదేవ్ పిలుపునిచ్చారు. కేజీ బేసిన్‌లో లభ్యమవుతున్న చమురు, సహజ వాయువులపై రాష్ట్ర వాటాను సాధించుకునేందుకు సంఘటితంగా కృషి చేయాలన్నారు. కోనసీమ జిల్లా అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం చమురు, సహజవాయు ఖనిజాలు, ప్రకృతి వనరులపై రాష్ట్ర ప్రజల హక్కులను కాపాడేందుకు, వాటిని సంరక్షించేందుకు నిర్వహించిన సదస్సుకు సామాజికవేత్త ఆలపాటి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ రాష్ట్రంలో కోట్ల విలువైన సహజ వాయువు నిల్వలు రాష్ట్రాన్ని దాటి పోతున్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు. బాంబే హైలో కూడా లేని సహజ వనరులు కేజీ బేసిన్‌లో ఉన్నాయన్నారు. వాటిని ప్రైవేటు సంస్థలు తరలించబోతున్నాయని, దాని వల్ల రాష్ట్రాభివృద్ధి కుంటు పడుతుందన్నారు. ప్రజలంతా ఏకమై సహజ వాయువు దోపిడీని అరికట్టేందుకు ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు కలసికట్టుగా చట్ట సభల్లో ప్రశ్నిస్తే రాష్ట్రానికి రావాల్సిన వాటా ఖచ్చితంగా దక్కుతుందన్నారు. గ్యాస్ పైపులైన్ల ఏర్పాటుతో రైతులు భూములు కోల్పోతూ తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రిలయన్స్ కార్యకలాపాల వల్ల తీరప్రాంతం వెంబడి తీరని నష్టం జరుగుతుందన్నారు. నష్ట నివారణకు ఏవిధమైన చర్యలు తీసుకోవడంలేదని మహదేవ్ విమర్శించారు. జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, కొల్లా రాజమోహన్ మాట్లాడారు. సదస్సులో డాక్టర్ ఇఆర్ సుబ్రహ్మణ్యం, వంటెద్దు వెంకన్నాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి కొప్పుల సత్తిబాబు తదితరులున్నారు.

ఎస్‌ఎంసీ చైర్మన్ మృతదేహం లభ్యం



తుల్యభాగ డ్రెయిన్‌లో లభ్యమైన సత్యం మృతదేహం

కరప, మే 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం గొర్రిపూడి వంతెన పైనుంచి తుల్యభాగ డ్రెయిన్‌లోకి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఎస్‌ఎంసీ చైర్మన్ కొలిశెట్టి సత్యం(42) మృతదేహం ఆదివారం ఉదయం లభ్యమైంది. కరప ఎస్ఐ తోట సునీత తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాజులూరు మండలం గొల్లపాలెం గ్రామానికి చెందిన కొలిశెట్టి సత్యం స్థానికంగా బిర్యానీ సెంటర్ నిర్వహిస్తుండడంతో పాటు గొల్లపాలెం హైస్కూల్ ఎస్‌ఎంసీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నాడు. శనివారం రాత్రి ఆయన సెల్‌లో మాట్లాడుతూ గొర్రిపూడి వంతెన పైనుంచి ఒక్కసారిగా దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో కరప పోలీసులు, కాకినాడ జగన్నాయకపూర్ ఫైర్‌స్టేషన్ సిబ్బంది, గజ ఈతగాళ్లు, స్థానిక మత్స్యకారులు తుల్యభాగ డ్రెయిన్‌లో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభ్యం కాని విషయం పాఠకులకు విదితమే. ఆదివారం ఉదయం రెస్క్యూ టీమ్ సహకారంతో గాలింపు చేపట్టగా మట్లపాలెం వద్ద సత్యం మృతదేహం లభ్యమైంది. స్థానిక వీఆర్వో సమక్షంలో శవపంచనామా నిర్వహించిన అనం తరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భార్యభర్తల మధ్య ఏ ర్పడిన వివాదం కారణంగా సత్యం ఆత్మహత్య కు పాల్పడినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. సత్యం మృతితో స్థానికంగా విషాదఛాయలు అలముకున్నాయి. ఘటనాస్థలి వద్ద కుటుంబసభ్యుల రోదనలతో పలువురు కన్నీటిపర్యంతమయ్యారు. బాధితుల ఫిర్యాదుతో కరప పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మార్చురీలో బిహార్ యువకుల మృతదేహాలు

ప్రత్తిపాడు, మే 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం వంతాడ వద్ద శనివారం లారీ ఢీకొన్న ఘటనలో మృతిచెందిన బిహార్ యువకులు ధీరజ్‌కుమార్, చందన్‌కుమార్‌మృతదేహాలను ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. ఆదివారం పోస్టుమార్టం జరగలేదు. మృతుల కుటుంబీలకు శనివారం రాత్రే సమాచారం అందించినప్పటికీ వారు రాకపోవడం వల్లే పోస్టుమార్టం వాయిదా పడినట్టు తెలుస్తోంది. సోమవారం మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి మృతుల కుటుంబాలకు అందజేస్తామని పోలీసులు తెలిపారు.

సత్యదేవుడికి రథోత్సవం

అన్నవరం, మే 25 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి వాసుడైన సత్యదేవుడికి ఆర్జితసేవయిన రథోత్సవం ఆదివారం వేడుకగా జరిగింది. స్వామి, అమ్మవార్లను ప్రధానాలయం నుంచి పుష్పాలతో అలంకరించిన రథంపై ఆశీనులు గావించి ప్రత్యేకపూజలు అనంతరం భక్తుల గోవిందనామస్మరణ, పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ ముమ్మారు ప్రదక్షిణ గావించారు.



‘లోవ’కు పోటెత్తిన భక్తులు

రూ.5.54 లక్షల ఆదాయం



లోవ దేవస్థానంలో భక్తులు



ప్రత్యేక అలంకరణలో తలుపులమ్మ

తుని రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేకువజామునే అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించిన ఆలయ పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్యూలలో బారులుతీరిన భక్తులు తల్లిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. ఆలయానికి రూ.5.54 లక్షల ఆదాయం సమకూరినట్టుఈవో పి.విశ్వనాధరాజు చెప్పారు.

అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి..



వధూవరులను ఆశీర్వదిస్తున్న డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి దంపతులు

ప్రేమకు హద్దులు, సరిహద్దులు ఉండవు. అందుకు ఉదహరణగా నిలిచారు ఈ దంపతులు. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం పులిమేరుకు చెందిన తుమ్మల అభి గత పదేళ్లుగా అమెరికాలోని సియాటెల్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. అక్కడ పనిచేస్తున్న కింబర్లీ అనే యువతితో పరిచయడం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారింది. వారి పెళ్లికి ఇరు కుటుంబాలు అంగీకారం తెలిపాయి. దీంతో అబ్బాయి స్వగ్రామం పులిమేరులో ఆదివారం వారి వివాహం దీనిని హిందూ సంప్రదాయ పద్ధతిలో జరిగింది. అమెరికా అమ్మాయి, ఆంధ్ర అబ్బాయి వివాహ వేడుకను చూసేందుకు జనం తరలివచ్చారు. డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి హాజరై జంటను ఆశీర్వదించారు. పెద్దాపురం (ఆంధ్రజ్యోతి)



కోనసీమలో కూసింత సేపు కూత!

రావులపాలెం (ఆంధ్రజ్యోతి)

కోనసీమ జిల్లా రావులపాలెం గౌతమి పాత వంతెన మీదుగా ట్రాలీ లారీపై రైల్ ఇంజన్ బోగీని ఆదివారం తరలించారు. తణుకు వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న దీన్ని కొత్త వంతెన మీదుగా చూసిన వారు ఇదేంటి కోనసీమకు రైల్వే లైన్ వచ్చేసిందా, ఈ ట్రైన్ ఎప్పటి నుంచి రాకపోకలు సాగిస్తోందంటూ చమత్కరిస్తూ ఆసక్తిగా తిలకించి ఫొటోలు తీసుకున్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

గొల్లప్రోలులో భారీ వర్షం

గొల్లప్రోలు, మే 25 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ, ఉక్కపోత వాతావరణంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. సాయంత్రం ఆకాశం మేఘావృతమై గాలులతో సుమారు గంటకు పైగా కురిసిన వర్షంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. డ్రైన్లు పొంగిపొర్లి రోడ్లపైకి నీరు చేరింది. వాతావరణం చల్లబడడంతో ప్రజలు సేదతీరారు.

చిన్నారులకు సర్వతోముఖ వికాస తరగతులు ప్రారంభం

గొల్లప్రోలు, మే 25 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో గొల్లప్రోలు పట్టణంతో పాటు కొడవలి గ్రామంలోని అంకాలమ్మ గుడి వద్ద చిన్నారులకు సర్వతోముఖ వికాస తరగతులను ఆదివారం నిర్వహించారు. ఇక నుంచి ప్రతి ఆదివారం గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తామని కళాక్షేత్రం ప్రతినిధులు తెలిపారు. తిరుపతి విజయశంకర స్వామీజీ, వాకపల్లి మహాశక్తి పీఠం మాతాజీ శ్రీకాళీ లక్ష్మీప్రసన్నాంద, అన్నమయ్య కళాక్షేత్రం కాకినాడ జిల్లా అధ్యక్షుడు సానా నూకరాజు నాయుడు, జిల్లా సమన్వయకర్త దిడ్డి సునీత, కోనసీమ, ఏలూరు జిల్లాల అధ్యక్షులు కుంపట్ల బాపన్ననాయుడు, సుబ్రహ్మణ్యం, రాంబాబు, కె.రాజబాబు, ఎం.సత్యనారాయణ, బేబీ, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ఈబీసీ కాలనీలో ఒక ఇంటి నిర్మాణం వద్ద మునిసిపల్ వాటర్ ట్యాంకర్

వాటర్ ట్యాంకర్ల దారి మళ్లింపు

ప్రైవేటు అవసరాలకు వినియోగం

గొల్లప్రోలు, మే 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు తాగునీరు అందించడం కోసం గొల్లప్రోలు నగర పంచాయతీ వాటర్ వర్క్స్ నుంచి బయల్దేరిన మునిసిపల్ వాటర్ ట్యాంకర్లు గమ్యం చేరకుండానే దారిమళ్లుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది కాసులకు కక్కుర్తిపడి వీటిని ప్రైవేటు అవసరాలకు మళ్లిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఆదివారం పట్టణ శివారు సూరంపేట ప్రజలకు తాగునీరు సరఫరా చేసేందుకు వాటర్ వర్క్స్ నుంచి బయల్దేరిన ట్యాంకరు అక్కడకు కాకుండా పట్టణంలోని ఈబీసీ కాలనీలో నిర్మాణంలో ఉన్న ఒక ఇంటి వద్దకు చేరుకుంది. ఇదే రీతిలో ప్రతిరోజూ కనీసం ఐదు నుంచి ఎనిమిది ట్రిప్పులు ట్యాంకర్లను దారి మళ్లిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వీటి నిర్వహణ చూసే కాంట్రాక్టర్ ఈ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని ప్రజలకు అందించినట్లు చూపించి నగర పంచాయతీ నుంచి ప్రతినెలా బిల్లులు తీసుకుంటుండడం విశేషం. మరోవైపు పట్టణంలోని పలు ప్రాంతాలకు తాగునీరు సక్రమంగా అందక ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందేలా చూడాల్సిన అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడినట్లు చెప్తున్నారు. నగర పంచాయతీ వాటర్ వర్క్స్‌లోని తాగునీటితో ట్యాంకర్ల ద్వారా వ్యాపారం జరుగుతున్నా అధికారులు పట్టనట్టు వ్యవహరించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

'మహానాడు' పోస్టర్ల ఆవిష్కరణ



కడప జిల్లాలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించనున్న మహానాడు విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. సుధా కాలనీలోని క్యాంపు కార్యాలయంలో మహానాడు పోస్టర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

- పెద్దాపురం (ఆంధ్రజ్యోతి)


పూడికతీత పనులను ప్రారంభిస్తున్న జనసేన నేత మర్రెడ్డి, డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ సునీల్‌కుమార్

పీబీసీ కాలువలో పూడికతీత పనులు ప్రారంభం

పిఠాపురం రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం చిత్రాడ వద్ద పీబీసీ కాలువలో రూ19.లక్షలతో గుర్రపుడెక్క, పూడిక తొలగింపు పనులను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, గోదావరి ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ ఆదివారం ప్రారంభించారు. ఖరీఫ్ సాగు ప్రారంభం నాటికి క్లోజర్ పనులు చేపట్టి పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామని వారు తెలిపారు. శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే జగదీష్, ప్రజాప్రతినిధులు, జనసేన నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


గొర్రిపూడిలో కేఎంజే కెనాల్ పూడికతీత పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

కేఎంజే కెనాల్ పూడికతీత పనులకు శ్రీకారం

కరప, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొర్రిపూడిలో రూ.12లక్షలతో కేఎంజే కెనాల్ పూడికతీత పనులకు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదివారం శ్రీకారం చుట్టారు. అనంతరం గ్రామంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, కరప డీసీ చైర్మన్ పీజీ సత్యనారాయణ, గొర్రిపూడి, పెనుగుదురు నీటి సంఘాల అధ్యక్షులు జోకా తాతాజీ, తుమ్మలపల్లి గోవిందరాజులు, కరప వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్రగడ రమేష్, నాయకులు గండి వెంకటేశ్వరరావు, బోగిరెడ్డి కొండబాబు, అనుకుల రాంబాబు, పుణ్యమంతుల అన్నారం, యాళ్ల పండు, దొర బాబు, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


ట్రై సైకిల్, కుట్టుమిషన్లు, సైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

'రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థుల సేవలు ఆదర్శనీయం'

కాకినాడ రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ, పరిసర ప్రాంతాల పేద ప్రజలకు రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థులు చేస్తున్న సేవలు ఆదర్శనీయమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. కాకినాడ బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్ ఆవరణలోని రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థుల చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో ఒక దివ్యాంగుడికి ట్రైసైకిల్, నలుగురు మహిళలకు కుట్టుమిషన్లు, ముగ్గురు విద్యార్థులకు సైకిళ్లను ఎమ్మెల్యే కొండబాబు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్టు సేవలను మరింత విస్తృతపరిచేందుకు కాకినాడలో ఒక స్థలాన్ని ప్రభుత్వం తరపున అందించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ బాదం బాలకృష్ణ, కోశాధికారి జగన్నాథరావు, పాపారావు, శ్రీనివాసరాజు, మధు, పద్మనాభం, రామ్‌చరణ్, కుమార్, జనార్దన్, సత్యశ్రీనివాసరావు, సరళ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వేసవి శిక్షణ

పెద్దాపురం, మే 25 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మర్ క్యాంపులో భాగంగా ఆదివారం విద్యా ర్థులకు దేశభక్తి, అభ్యుదయమైన గీతాలను జన విజ్ఞాన వేదిక నాయకురాలు పావని నేర్పించారు. గురజాడ అప్పారావు రచించిన దేశభక్తి గీతం, పర్యావరణ సంబంధ గీతాలపై అవగాహన కల్పించారు. యూటీఎఫ్ పట్టణ కార్యదర్శి బేబీరత్నం వేమన పద్యాలు నేర్పించారు. డాన్స్-సందీప్ కర్రసాము-నీలపాల కృష్ణ, కోలాటం-అంజలి, అనూష, జశ్విత కరాటే-వ్యాయామంలను యోగేష్, లోకేష్ నేర్పించారు. పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు బుద్ధ శ్రీనివాస్, కార్యదర్శి రొంగల అరుణ్, అమృత సమ్రత, భాష, సందీప్, హర్ష, నాని సాయి, బంగారం, లావణ్య, లలిత, స్నేహ, రేణుక, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కాకినాడ టూటౌన్ బ్రిడ్జి రెయిలింగ్ పెచ్చులుగా ఊడి ఊచలు బయటకు కన్పిస్తున్న దృశ్యాలు

వంతెనల నిర్వహణ శూన్యం

ఫుట్‌పాత్ రెయిలింగ్‌లు శిథిలం.. జగన్నాథపురం, టూటౌన్ బ్రిడ్జిల దిగువున పిచ్చిమొక్కలు

కాకినాడ సిటీ, మే 25 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి వంతెనల నిర్వహణ చేపట్టకపోవడంతో పిచ్చిమొక్కలు మొలిచి శిథిలస్థితికి చేరాయి. నగరంలోని జగన్నాథపురం ఉప్పుటేరు బ్రిడ్జి, టూటౌన్ బ్రిడ్జి దిగువ సిమెంటు పెచ్చులూడిపోతూ రెయిలింగ్‌లు దెబ్బతిన్నాయి. ఆర్‌అండ్‌బీ పరిధిలోని ఈ వంతెనలను కార్పొరేషన్ నిర్వహిస్తోంది. నిధుల కొరత వల్ల గత ఐదేళ్లు ఏమాత్రం పట్టించుకోలేదు. వంతెన ఫుట్‌పాత్‌ల దిగువ పిచ్చిమొక్కలను ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో వేళ్లు బలంగా చొచ్చుకుని సిమెంటు పెచ్చులూడిపోతూ ఇనుప ఊచలు బయటకు వచ్చేశాయి. జగన్నాథపురం ఉప్పుటేరుపై ప్రీటెస్ట్ కాంక్రీట్ విధానంలో నిర్మించిన బ్రిడ్జిని 1963లో ప్రారంభించారు. 60 ఏళ్లు దాటిన ఈ బ్రిడ్జి సామర్థ్యం తగ్గుతోందని గతంలోనే నిపుణులు నివేదిక సమర్పించారు. పదేళ్ల క్రితం ఇరువైపులా సిమెంటు రెయిలింగ్‌లు తొలగించి ఐరన్ రెయిలింగ్‌లు ఏర్పాటు చేసి ఫుట్‌పాత్‌లను టైల్స్‌తో ఆధునికీకరించారు. ఆ తర్వాత దీని నిర్వహణను గాలికి వదిలేశారు. 1975లో నిర్మించిన టూటౌన్ బ్రిడ్జి సిమెంట్ రెయిలింగ్‌లు దెబ్బతిన్నాయి. ఫుట్‌పాత్‌ల దిగువ పిచ్చిమొక్కలు మొలిచి వంతెన పటిష్టతను దెబ్బతీస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.


జగన్నాథపురం వంతెన శిథిలమై రెయిలింగ్, కింది భాగంలో బయటకు వచ్చిన ఇనుప ఊచలు

'కశ్మీర్‌కు కల్పించిన రాజ్యాంగ హక్కులను అమలు చేయాలి'

కాకినాడ సిటీ, మే 25 (ఆంధ్రజ్యోతి): భారత యూనియన్‌లో విలీనం సందర్భంలో కశ్మీర్‌కు కల్పించిన రాజ్యాంగ హక్కులను అమలు చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ కోరారు. రఘుపతి వెంకటరత్నంనాయుడు స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో కాకినాడ యూటీఎఫ్ టీచర్స్ హోంలో 'కశ్మీర్ పూర్వాపరాలు-ప్రస్తుత సవాళ్లు' అంశంపై ఆదివారం జరిగిన సదస్సుకు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ సూరిబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న అజశర్మ మాట్లాడుతూ భారతదేశం స్వాతంత్ర్యం పొందిన తర్వాత నేషనల్ కాన్ఫరెన్స్ నాయకత్వంలో కశ్మీర్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందన్నారు. ఆ సందర్భంలో రాజ్యాంగంలో 370 అధికరణం, 35ఎ చేర్చారన్నారు. 75 ఏళ్లుగా కేంద్ర పాలకులు ఎవరున్నా కశ్మీర్‌లో రాజ్యాంగ హక్కులను సక్రమంగా అమలు చేయలేదన్నారు. దీంతో తాజాగా కశ్మీర్‌లో భూములను కార్పొరేట్లు కాజేసే అవకాశం ఉందన్నారు. దీనివల్ల నిరుద్యోగం పెరిగి ఇతర సమస్యలు తలెత్తడానికి కారణమవుతుందన్నారు. ఉగ్రదాడి నేపథ్యంలో కశ్మీర్ ప్రజలంతా దేశం వైపే ఐక్యంగా నిలబడ్డారన్నారు. ప్రజలంతా మతసామరస్యం కోసం నిలబడి దేశ సమైక్యత, సమగ్రతలను కాపాడుకోవాలన్నారు. స్టడీ సర్కిల్ కన్వీనర్ ఎన్.గోవిందరాజులు, యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎంవీ సాయిరాం, రాష్ట్ర పూర్వ కార్యదర్శి జి.ప్రభాకరవర్మ, ప్రజా సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ




సరైన పత్రాలు లేకపోవడంతో పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

ఇళ్ల వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు (ఎడమ)

పిఠాపురంలో పోలీసుల కార్డన్ సెర్చ్

జగ్గయ్యచెరువు కాలనీని జల్లెడ పట్టారు

సరైన పత్రాలు లేని 43 వాహనాలు సీజ్

15 లీటర్ల నాటుసారా స్వాధీనం

పిఠాపురం, మే 25 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఎస్పీ బిందుమాధవ్, ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ ఆదేశాలతో పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని ఎస్‌ఐలు, పోలీసులు, క్విక్ రెస్పాన్స్ టీమ్ సిబ్బంది ఆదివారం తెల్లవారుజామునే జగ్గయ్యచెరువు కాలనీకి చేరుకుని మొత్తం జల్లెడ పట్టారు. గృహాల యజమానులు, అద్దెకు ఉంటున్న వారి వివరాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేని 43 వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఒక ఇంట్లో 15 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అనుమానిత వ్యక్తులు వచ్చినా, అసాంఘిక కార్యకలాపాలు జరిగినా వెంటనే సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు. తనిఖీల్లో ఎస్‌ఐలు మణికుమార్, జానీబాషా, ఎన్.రామకృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

తాళ్లరేవు, మే 25 (ఆంధ్రజ్యోతి): యానాం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న బూసు యేసురాజును రవి జూనియర్ కాలేజీ వద్ద పట్టుకున్నట్టు ఎక్సైజ్ ఎస్‌ఐ నాగేంద్రకృష్ణ ఆదివారం తెలిపారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని యేసురాజును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు ఎస్‌ఐ చెప్పారు.

దుర్గాడ శివాలయంలో మాస శివరాత్రి పూజలు

గొల్లప్రోలు రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): మాసశివరాత్రి సందర్భంగా దుర్గాడ శివాలయంలో ఆదివారం ప్రత్యేక అభిషేకాలు, సూర్యనమస్కారాలు, లలితాదేవికి కుంకుమార్చనలను అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు జరిపించారు. పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామికి హరిద్ర, కుంకుమ, సుగంధ జలాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో స్వామి, అమ్మవార్లను అలంకరించారు. శ్రీసూక్త, దుర్గాసూక్త, సహస్రనామ పారాయణ చేసి శరీర ఆరోగ్యం కోసం త్రిచ, సౌర విధానాలతో సూర్యనారాయణస్వామికి సూర్యనమస్కారాలు సమర్పించారు.


ప్రత్యేక అలంకరణలో ఉమారామలింగేశ్వర స్వామి


అమ్మవారికి అలంకరించిన బంగారు నత్తు

మరిడమ్మకు బంగారు నత్తు బహూకరణ

పెద్దాపురం, మే 25 (ఆంధ్రజ్యోతి): మరిడమ్మ అమ్మవారికి తునికి చెందిన బర్ల కృష్ణ గంగరాజు-మాధవి దంపతులు రూ.3.80 లక్షలు విలువచేసే బంగారు నత్తు బహూకరించారని సహాయ కమిషనరు కె.విజయలక్ష్మి తెలిపారు. దాతలకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం చేయించి వేదాశీర్వచనం ఇచ్చి ప్రసాదం అందజేశారు.

మరిడమ్మ దేవస్థానంలో ఆదివారం అన్నదానం నిర్వహించినట్టు సహాయ కమిషనరు కె.విజయలక్ష్మి తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కొండబాబు

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

కాకినాడ సిటీ, మే 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సహకార సంస్థ ఆధ్వర్యంలో జగన్నాథపురంలోని తూరంగిపేటలో ఏర్పాటుచేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో బొడ్డు శివాజీ, కోనాడ ప్రకాశరావు, చవ్వాకుల రాంబాబు, బడే ఆనంద్, గొరుసు దుర్గారావు, చింతపల్లి తాతారావు, అంగాడి దుర్గారావు, ఓలేటి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు జట్ల ఎంపిక

సామర్లకోట, మే 25 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా నరసరావుపేటలో జూన్ ఒకటో తేదీ నుంచి జరిగే అంతర్ జిల్లా స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు బాల, బాలికల జట్లను పట్టణంలోని దుర్గాప్రసాద్ పబ్లిక్ స్కూలులో ఆదివారం ఎంపిక చేసినట్టు అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి సతీష్ తెలిపారు. బాలుర విభాగంలో ధనుంజయ, ముత్యాల ముఖేష్, నాగకృష్ణ, ప్రభాకర్, సాయి ధనుష్, రాజ్, వెంకటేష్, దొరస్వామి, రాకేష్, బాలికల విభాగంలో షణ్ముఖ శ్రీసాయి, సహస్రశ్రీ, ఎంపికయ్యారు. కార్యక్రమంలో కార్యదర్శి ఇనుసుమళ్ల రాజు, వంగా వెంకట శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న నాయకులు

పిఠాపురంలో సమైక్యతా దినోత్సవ ర్యాలీ

పిఠాపురం, మే 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం సమైక్యతా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. పహల్గాంలో ఉగ్ర దాడి అనంతరం ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌కు తగురీతిలో బుద్ధి చెప్పిన మన సైనిక దళాలకు అభినందనలు తెలిపారు. సీపీఎం జిల్లా నాయకుడు కోనేటి రాజు, పిఠాపురం కన్వీనర్ కుంచే చిన్నా, కోనే టి.రాజు, నాగేశ్వరరావు, జి.వీరబాబు, కె.మణి, మణికంఠ, విశ్వనాథం, రాజేష్, సూర్యనారాయణ, నాగచక్రం తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం దృష్టిలో గోర్స ఆలయ భూములు

కొత్తపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): గోర్స గ్రామానికి చెందిన సీతారామస్వామి ఆలయ భూముల రక్షణ విషయం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టిలో ఉందని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు చెప్పినట్టు ఆ పార్టీ నాయకులు గంధం సత్యనారాయణ, మద్దా రాజు తెలిపారు. ఆలయ భూముల స్వాధీనంపై డిప్యూటీ సీఎం ఇప్పటికే కలెక్టర్, దేవదాయ శాఖ అధికారులతో చర్చించారని, భూముల విషయం కోర్టులో పెండింగులో ఉండడంతో ఆలస్యమవుతోందన్నారు. దేవుడి భూములను ఎవరూ ఆక్రమించలేరన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గండేపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామయంపాలెం, సింగరాయపాలెం గ్రామాలకు సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ బి.వీరభద్రరావు, ఏఈ కిరణ్ కిషోర్ తెలిపారు. రామయంపాలెంలో నిర్మిస్తున్న కొత్త విద్యుత్ సబ్ స్టేషన్, విద్యుత్ లైన్లు, పనులు జరుగుతున్నందున విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



చిన్నపాటి వర్షానికే నీరు కారుతున్న స్లాబ్... ఆ కిందే మంచాలపై రోగులు

స్లాబ్‌కు లీకులు... రోగులకు అవస్థలు

మోతుగూడెం, మే 25 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెం పీహెచ్‌సీ వర్షాకాలం ప్రారంభం కాక ముందే రోగులతో కిక్కిరిసిపోయింది. వారికి వైద్యం చేసే సమయంలో స్లాబ్ మొత్తం కారిపోతోంది. స్లాబ్‌ను టార్పాలిన్లతో కప్పి ఉంచినప్పటికీ దాంట్లోంచి వర్షపు నీరు కారుతుండడంతో రోగులు నానా అవస్థలు పడుతున్నారు. ఫార్మసీ గది సైతం కారిపోతోంది. దీంతో మందులన్నీ తడిసి ముద్దవుతున్నాయి. అధికారులు పీహెచ్‌సీకి వచ్చి చూసి వెళ్తున్నప్పటికీ మోక్షం కలగట్లేదు. రానున్నది వర్షాకాలం కావడంతో పరిస్థితులు ఎలా ఉంటాయోనని రోగులు ఆందోళన చెందుతున్నారు.



మొక్కజొన్న కండెలకు మొలకలు వచ్చిన దృశ్యం

వర్షాలకు తడిసిన మొక్కజొన్న

దేవీపట్నం, మే 25 (ఆంధ్రజ్యోతి): మం డలంలో గత పది రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఇందుకూరుపేట, ఇందుకూరు, కొత్తవీధి, చాపరాలపల్లి, ఫజిల్లాబాద్, పోతవరం, దేవారం, శరభవరం తదితర గ్రామా ల్లో అక్కడక్కడ మొక్కజొన్న పంట కల్లాలపై ఉంది. అవి తడిసి ముద్దయ్యాయి. వేలల్లో పెట్టుబడి పెట్టి కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయానికి వర్షాలతో మొలకలు వచ్చాయి. నాణ్యత తగ్గి నష్టం వాటిల్లుతుందని మొక్కజొన్న సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు.



గండిపోశమ్మ అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

గండిపోశమ్మ ఆలయానికి భక్తుల తాకిడి

దేవీపట్నం, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. గోదావరిలో స్నానాలు ఆచరించి అమ్మవారికి అభిషేకాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. టిక్కెట్లు, ఇతరత్రా రూ.26,170 ఆదాయం వచ్చిందని ఆలయ అధికారులు తెలిపారు.

పాపికొండలు విహార యాత్రకు ఆదివారం ఐదు బోట్లలో 296 మంది పర్యాటకులు వెళ్లారు. ముందుగా గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకుని పూడిపల్లి, దేవీపట్నం, మూలపాడు, మంటూరు, కొండమొదలు మీదుగా పేరంటాలపల్లి వెళ్లి రెండు గంటలసేపు సందడి చేశారు. పర్యాటకులు బ్యాగ్‌లను ఎస్‌ఐ షరీఫ్ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీ చేశారు. బోటు నిర్వాహకులు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.



బోట్ పాయింట్ వద్ద పర్యాటకుల బ్యాగ్‌లు తనిఖీ చేస్తున్న పోలీసు

ఆర్టీసీ బస్సు, మోటారు సైకిలు ఢీ: ఇద్దరికి గాయాలు

వై.రామవరం, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పనసలపాలెం ప్రధాన రహదారిలో ఆదివారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. పనసలపాలేనికి చెందిన రేలుపల్లి రమణారెడ్డి, పల్లాల నాగిరెడ్డి మోటారు సైకిలుపై చవిటిదిబ్బలు పెళ్లికి వెళ్తుండగా బైక్, బస్సు పరస్పరం ఢీకొన్నాయి. డ్రైవర్ బస్సును అదుపు చేయడంతో ప్రాణాపాయం తప్పిందని పలువురు చెప్పారు. క్షతగాత్రులను వై.రామవరం ఆసుపత్రికి తరలించగా చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేశారు. నాగిరెడ్డి కాలికి, చేయికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు మెడికో లీగల్ కేసు చేశారు.



తీవ్రంగా గాయపడిన నాగిరెడ్డి

13 మద్యం సీసాలు స్వాధీనం

దేవీపట్నం, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలకోట గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్నట్టు సమాచారం రావడంతో ఎస్‌ఐ షరీఫ్ దాడులు నిర్వహించారు. ఒక వ్యక్తిని అరెస్టు చేసి 180 మి.లీ. మద్యం సీసాలు 13 స్వాధీనం చేసుకున్నారు.



మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధి

పౌరులంతా దేశభక్తి కలిగి ఉండాలి

తుని రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి పౌరుడు దేశభక్తిని కలిగి ఉండాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ ప్రతినిధి వడ్డాది సుబ్బారావు అన్నారు. స్థానిక గణపతినగర్‌లో 3రోజులుగా జరుగుతున్న శిక్షణా తరగతుల ముగిశాయి. వక్తలు మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం 100 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు రూపొందించినట్టు తెలిపారు.



సమావేశంలో పాల్గొన్న మంత్రుల బృందం

మహానాడు ఏర్పాట్ల సమీక్షలో పాల్గొన్న నెహ్రూ

జగ్గంపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): కడపలో టీడీపీ మహానాడు ఏర్పాట్లపై మంత్రుల బృందం నిర్వహించిన సమీక్షా సమావేశంలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు.

రూ.25లక్షల వంతున నష్టపరిహారం చెల్లించాలి

ప్రత్తిపాడు, మే 25 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలం వంతాడలో లేటరైట్ మైనింగ్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా జరిగిన మైనింగ్ లారీల ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు బిహార్ యువకులకు రూ.25లక్షలు నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దువ్వాశేషు బాబ్జి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మైనింగ్ యాజమాన్యంపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఈ ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వంతాడ కొండపై శనివారం సాయంత్రం భారీగా వర్షం కురిసినప్పటికీ లారీలను నిర్లక్ష్యంగా కిందకు రవాణా చేయడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని, అధికార యంత్రాంగం పూర్తిగా వైఫల్యం చెందడం వల్లే ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. తక్షణం బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని లేకపోతే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.



ఎన్టీరాజాపురం వెళ్లే రహదారిలో గోతుల్లోకి చేరిన వర్షం నీరు

అధ్వానంగా రహదారి.. ప్రయాణికులకు తప్పని పాట్లు

గండేపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): గండేపల్లి నుంచి ఎన్టీరాజాపురం మీదుగా గోపాలపురం వెళ్లే రహదారి అధ్వానంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి గోతులమయం కావడంతో వర్షం కురిసినప్పుడు వర్షపు నీరు గోతుల్లోకి చేరి చెరువులను తలపిస్తున్నాయి. ఈ రహదారిలో ప్రయాణించాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం రోడ్లు గాలికి వదిలేయడంతో అధ్వానంగా తయారయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్లన్నీ మెరుగుపడుతున్నాయి. అయితే ఈ రహదారిని కూడా మెరుగుపరచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు



డి.పోలవరంలో చెరువుగట్టును తొలగించి చదును చేసి పంట పొలంలో కలిపేసిన దృశ్యం

డి.పోలవరం నారప్ప చెరువులో ఆక్రమణల జోరు

చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

తుని రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): చెరువుగట్లు పటిష్ఠం చేసి సాగు,తాగునీటి చెరువులను పరిరక్షించేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకం ద్వారా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అక్రమార్కుల భూదాహానికి సాగు, తాగునీటి చెరువులు విలవిలలాడుతున్నాయి. తుని మండలంలోని డి.పోలవరం గ్రామంలో నారప్ప చెరువులో మండలానికి చెందిన ఒక నాయకుడు చెరువు గట్టును తొలగించి ఆక్రమణకు సిద్ధమవడం చర్చనీయాంశమైంది. డి.పోలవరం 114వ సర్వే నెంబరులో నారప్ప చెరువు 11ఎకరాల 60 సెంట్లు గర్భం కలిగి ఉండగా ఎగువున చెరువు గర్భాన్ని ఆక్రమించుకున్నట్టు ఆయకట్టు రైతులు వాపోతున్నారు. అధికారుల చోద్యంతో ఏటా నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నామని, పట్టపగలే జేసీబీలతో చెరువుగట్టును తొలగిస్తుంటే కట్టడి చేయాల్సిన అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని నారప్ప చెరువులో ఆక్రమణలు అడ్డుకుని చెరువును పరిరక్షించాలని కోరుతున్నారు.

సనాతన ధర్మాన్ని బాల్యం నుంచే బోధించాలి



ప్రత్తిపాడు మండలంలో స్వామిజీ, మాతాజీలను సన్మానిస్తున్న అన్నమయ్య కళాక్షేత్రం నిర్వాహకులు

ప్రత్తిపాడు, మే 25 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మాన్ని విద్యార్థులు, చిన్నారులకు బాల్యం నుంచే బోధించాలని స్వామిజీలు రమణానంద, విజయశేఖర్ , మాతాజీ కాళీ లక్ష్మి ప్రసన్న అనోదలు చెప్పారు. మండలంలోని ధర్మవరం నూకాంబిక ఆలయం వద్ద కాకినాడ జిల్లా అన్నమయ్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఆదివారం అన్నమయ్య చిన్నారుల సర్వతో ముఖ వికాస తరగతులను సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి, స్వామిజీ, మాతాజీలు ప్రారంభించారు. అన్నమయ్యకళాక్షేత్రం ఉత్తరాంధ్ర కో ఆర్డినేటర్ సానా నూకరాజు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో స్వామిజీలు, మాతాజీలు ముఖ్య అతిథులుగా పాల్గొని భారతదేశ హిందూ సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందన్నారు. కాకినాడ శ్రీ మద్‌రామాయణ పీఠం అధ్యక్షులు గల్లా సుబ్బారావు మాట్లాడారు. సర్పంచ్ సుశీల అబ్బాయి దంపతులు, స్వామిజీలు రమణానంద, చంద్రశేఖర్, మాతాజీలు కాళీలక్ష్మిప్రసన్న, అనోద, సునీత, రామకోటి సుబ్బారావులను కళాక్షేత్రం కన్వీనర్ సానా నూకరాజు బృందం శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు జువ్వల చినబాబు, పి.అప్పలరాజు, టి. సూర్యనారాయణ, సిద్ద పెద్దిరాజు, దాట్ల గంగరాజు, కడారి శ్రీను, సిద్దా అప్పలరాజు, పైడితల్లి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ఏలేశ్వరం, మే25(ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1998 - 2003 విద్యా సంవత్సరంలో 6వ తరగతి నుంచి 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం అదే పాఠశాల ఆవరణలో జరిగింది. 22 ఏళ్ల తరువాత సమావేశమై ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమ మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఉపాధ్యాయులు జహీరుద్దీన్, అప్పాజీ, జ్యోతిరాజు, రమణికుమారి, ఆచార్యు లకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి మెమెంటోలు అంద జేసి ఘనంగా సత్కరించారు. అందే చైతన్య, చరణ్, కటకం సూర్యకుమారి, అప్పారావు, వెంకటలక్ష్మి, కళ్యాణి, వెంకటేష్, దుర్గా ప్రసాద్, లక్ష్మి, పాల్గొన్నారు.



ఏలేశ్వరం ప్రభుత్వ పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు



ప్రత్తిపాడులో తోటవీధి సాయిబాబా మార్గం వద్ద రోడ్డుపై మురుగునీరు

వర్షాలతో గ్రామీణ రహదారుల చిత్తడి

ప్రత్తిపాడు, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో గడిచిన 4రోజుల్లో అడపాదడపా కురుస్తున్న భారీ వర్షాలు వల్ల గ్రామీ ణ రహదారులు చిత్తడిచిత్తడిగా మారి అపారిశుధ్యానికి నిలయంగా మారాయి. ఒమ్మంగి గ్రామ నడి మధ్యలో ఉన్న మూడు రోడ్ల కూడలి జంక్షన్ ప్రత్తిపాడు అల్లూరి సీతారామరాజు సెంటర్ వర్షాలకు జలమయం అవుతున్నాయి. నూతనంగా ఉత్తరకంచి నుంచి పెద్దిపాలెం రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టినా భారీ వర్షాలు వల్ల రహదారి నిర్మాణ పనులు జరగక ఈ మూడు కిలోమీటర్ల మార్గం బురద, గోతులమయంగా ఉండటంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. కాకినాడ నుంచి పెద్దిపాలెం వరకు నడిచే ఆర్టీసీ బస్సులు, పెద్దిపాలెం గ్రామ ప్రారంభంలో ఉన్న ఏలేరు కాలువ రైస్ మిల్లులు వద్ద ఆర్టీసీ బస్సులు నిలిపివేసి అక్కడ నుంచి వెనక్కి మళ్లిస్తున్నారు.దీని వల్ల పెద్దిపాలెం, వేములపాలెం, గోకవరం, రౌతుపాలెం, కిత్తమూరుపేట, బురదకోట తదితర గ్రామాలకు చెందిన ప్రజలు కాకినాడ, ప్రత్తిపాడు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వర్షపునీరు నిలిచిపోయి రహదారిపై ఉండిపోవడం వల్ల రోగులు ప్రబబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.





సరైన పత్రాలు లేకపోవడంతో పోలీసులు సీజ్ చేసిన వాహనాలు
ఇళ్ల వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు (ఎడమ)

పిఠాపురంలో పోలీసుల కార్డన్ సెర్చ్

జగ్గయ్యచెరువు కాలనీని జల్లెడ పట్టారు
సరైన పత్రాలు లేని 43 వాహనాలు సీజ్
15 లీటర్ల నాటుసారా స్వాధీనం

పిఠాపురం, మే 25 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఎస్పీ బిందుమాధవ్, ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ ఆదేశాలతో పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని ఎస్‌ఐలు, పోలీసులు, క్విక్ రెస్పాన్స్ టీమ్ సిబ్బంది ఆదివారం తెల్లవారుజామునే జగ్గయ్యచెరువు కాలనీకి చేరుకుని మొత్తం జల్లెడ పట్టారు. గృహాల యజమానులు, అద్దెకు ఉంటున్న వారి వివరాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేని 43 వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఒక ఇంట్లో 15 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అనుమానిత వ్యక్తులు వచ్చినా, అసాంఘిక కార్యకలాపాలు జరిగినా వెంటనే సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు. తనిఖీల్లో ఎస్‌ఐలు మణికుమార్, జానీబాషా, ఎన్.రామకృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేటలో వీధి కుక్కల బెడద

జగ్గంపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో వీధి కుక్కలు అధికమయ్యాయి. 18 వార్డుల్లో కుక్కలు దాడి చేయడంతో ఇటీవల అనేకమంది గాయపడి స్థానిక కమ్యూనిటీ హాల్ సెంటర్‌లో చికిత్స పొందారు. దీనికి తోడు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసేవారు, సీనియర్ సిటిజన్లు కుక్కల దాడులతో బెంబేలెత్తిపోతున్నారు. పంచాయతీ సిబ్బంది వీధి కుక్కలను పట్టుకోవాలని గ్రామస్తులు, ప్రజలు కోరుతున్నారు.



మల్లేపల్లిలో గుంపులుగా సంచరిస్తున్న పందులు

మల్లేపల్లిలో పందుల స్వైర విహారం

గండేపల్లి, మే 25(ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా మండలంలోని మల్లేపల్లి గ్రామవీధుల్లో పందులు గుంపులుగా స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో ఆ ప్రాంతమంతా కాలుష్యం, అపారిశుధ్యం పెరిగిపోతుంది. ఎటువంటి రోగాలకు గురవుతామేమోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పందుల పెంపకందారులు వాటిని వాటి స్థావరాల్లో ఉంచి పెంపకం చేయకుండా నిర్లక్ష్యంగా గ్రామంలోకి వదిలేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఎన్నిసార్లు పంచాయతీ సిబ్బంది హెచ్చరించినా పెంపకందారులు తీరు మారట్లేదని, దీనిపై అధికారులు స్పందించి చర్య లు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రత్తిపాడు అభివృద్ధికి కష్టపడి పనిచేస్తా

ప్రత్తిపాడు, మే 25 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని వైసీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు చెప్పారు. మండలంలోని రాచపల్లి, పొదురుపాక గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించి కార్యకర్తలు, అభిమానులు,నాయకులతో సమావేశమయ్యారు. ఎన్నికల్లో సూపర్‌సిక్స్ పథకాల పేరుతో ప్రజలను నమ్మించి కూటమి ప్రభుత్వం మోసం చేసిందని కూటమి వైఫల్యాలు, మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్ని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బంకు శ్రీను, వైసీపీ నాయకులు రామిశెట్టి నాని, దళే చిట్టిబాబు, సారిపల్లి గంగరాజు, చందక నాని పాల్గొన్నారు.

నేడు కత్తిపూడిలో బీజేపీ కిసాన్ మోర్చా సమావేశం

ప్రత్తిపాడు, మే 25 (ఆంధ్రజ్యోతి): భారతీయ కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశం సోమవారం సాయంత్రం 3 గంటలకు కత్తిపూడిలో నిర్వహించనున్నట్టు జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు సింగిలిదేవ్ సత్తిరాజు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, రాష్ట్ర, జిల్లా మతాధికారులు, కిసాన్ మోర్చా మండల కమి టీలు పాల్గొననున్నారని సత్తిరాజు తెలిపారు.



ధర్మవరంలో కురుస్తున్న వర్షం

ప్రత్తిపాడులో భారీ వర్షం

ప్రత్తిపాడు, మే 25 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భానుడు భగభగ మండటంతో అల్లాడిన ప్రజానీకానికి సాయంత్రం కురిసిన వర్షం ఎంతో ఆహ్లాదకంగా మారింది.

మరిడమ్మకు బంగారు నత్తు బహూకరణ



పెద్దాపురం, మే 25 (ఆంధ్రజ్యోతి): మరి డమ్మ అమ్మవారికి తునికి చెందిన బర్ల కృష్ణ గంగరాజు -మాదవి దంపతులు రూ.3.80 లక్ష లు విలువచేసే బంగారు నత్తు బహూకరిం చారని సహాయ కమిషనరు కె.విజయలక్ష్మి తె లిపారు. దాతలకు ఆలయ మర్యాదలతో స్వా గతం పలికి దర్శనం చేయించి వేదాశీర్వచనం ఇచ్చి ప్రసాదం అందజేశారు.

మరిడమ్మ దేవస్థానంలో ఆదివారం అన్న దానం నిర్వహించినట్టు సహాయ కమిషనరు కె.విజయలక్ష్మి తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.